క్లుప్తంగా

వేడుకగా ముత్యాలమ్మ సంబరం


కాళీమాత వేషధారణతో ముత్యాలమ్మ ఊరేగింపు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని కేసపురం గ్రామ దేవత ముత్యాలమ్మ సంబరాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. గుజ్జు కూర్మారావు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కాళీమాత వేషధారణలో కవిటి కళాకారులు నృత్యాలతో అలరించారు. సన్నాయి మేళంతో అమ్మవారిని పుర వీధుల్లో ఊరేగించారు.

ఎన్నికలకు సహకరించినవారికి ధన్యవాదాలు

- ఇచ్ఛాపురం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పిరియా విజయ


పిరియా విజయ

కంచిలి: ఈ నెల 13వ తేదీన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సజావుగా జరిగేందుకు సహకరించిన ఇచ్ఛాపురం నియోజకవర్గ ప్రజానీకానికి, పార్టీ శ్రేణులకు ఇచ్ఛాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పిరియా విజయ ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఆమె కార్యాలయం నుంచి మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. సహకరించిన పార్టీ ముఖ్యనేతలు, ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యేలు, అన్ని మండలాలు, మున్సిపాలిటీ ప్రతినిధులు, పార్టీ కార్యవర్గాలకు పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతాభివందనాలు తెలియజేశారు.

సీబీఎస్ఈ టెన్త్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల కార్యదర్శి జోహార్‌ఖాన్ తదితరులు

ఇచ్ఛాపురం: సీబీఎస్ఈ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో స్థానిక జ్ఞానభారతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించినట్టు విద్యాసంస్థల కార్యదర్శి జోహార్‌ఖాన్ మంగళవారం తెలిపారు. పరీక్షల్లో ఉమ్మిహబీబా (87శాతం), సుమిత్‌సాహు (86.6 శాతం), 12వ తరగతిలో పిల్లి శైలజ (72 శాతం), బాసి లక్ష్మీదేవి (69.8 శాతం) మార్కులతో విద్యార్థులు ప్రతిభ చూపారన్నారు. వీరిని పాఠశాల ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఇందుభూషణ్ పండా, హెచ్ఎం రషీదాసుల్తానా, మేనేజర్ ప్రమోద్‌కుమార్, అలీమ్‌ఖాన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పలాసలో 75.34 శాతం పోలింగ్

- వివరాలు వెల్లడించిన ఎన్నిక అధికారి భరత్ నాయక్


కాశీబుగ్గ హైస్కూల్ కేంద్రంలో సోమవారం సాయంత్రం ఏడు గంటల తరువాత కూడా ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు

కాశీబుగ్గ: పలాస అసెంబ్లీ నియోజకవర్గంలో ఈ నెల 13వ తేదీన జరిగిన ఎన్నికలో పోలైన ఓట్ల వివరాలను రిటర్నింగ్ అధికారి భరత్ నాయక్ మంగళవారం వెల్లడించారు. ఉదయం ఏడు గంటల నుంచి రాత్రి 8.43 గంటల వరకు జరిగిన ఎన్నికల ప్రక్రియలో 75.34 శాతం పోలింగ్ నమోదైనట్టు పేర్కొన్నారు. నియోజకవర్గంలో 1,07,278 మంది పురుషులు, 1,12,049 పురుషులు, 21 మంది ఇతరులతో కలిపి మొత్తం 2,19,348 ఓటర్లు ఉన్నట్టు పేర్కొన్నారు. వీరిలో 76,839 మంది పురుషులు, 88,416 మంది మహిళలు, ఇతరులు ఇద్దరులతో కలిపి మొత్తం 1,65,257 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు.

పలాస చరిత్రలో అత్యధిక ఓటింగ్ ఇదే..

కాశీబుగ్గ: పలాస అసెంబ్లీ నియోజకవర్గంలో మునుపెన్నడూ లేనంతగా సోమవారం జరిగిన ఎన్నికల్లో ఓటర్ల స్పందన కనిపించింది. 2009లో సోంపేట నియోజకవర్గంలో సగభాగం, టెక్కలి నియోజకవర్గంలో సగభాగంతో నూతనంగా ఏర్పాటు చేసిన పలాస నియోజకవర్గంలో ఓటింగ్ సరళిని పరిశీలిస్తే పెరుగుతూ వస్తుంది. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో 1,18,288 మంది ఓటు వేయడం ద్వారా 73.07 శాతం పోలింగ్ నమోదైంది. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో 1,36,566 మంది ఓటు హక్కును వినియోగించుకోగా.. 71.08 శాతం పోలింగ్ నమోదు చేసుకుంది. 2019 ఎన్నికల్లో 1,47,647 మంది ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా 72.09 శాతం పోలింగ్‌తో పెరుగుదలను చూపించారు. తాజాగా ఈ నెల 13వ తేదీన జరిగిన ఎన్నికల్లో అత్యధికంగా 1,65,257 మంది ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా 75.34 శాతం పోలింగ్ నమోదు చేసుకుని చరిత్రలో సృష్టించింది.



చిన్నారుల కోసం.. వేసవి శిబిరాలు సిద్ధం..


సంగీత నిలయంలో సాధన చేస్తున్న చిన్నారులు

- సంగీతం, నృత్యం, వాద్యపరికరాలపై శిక్షణ

శ్రీకాకుళం కల్చరల్: వేసవి సెలవులు ప్రారంభమయ్యాయి. పాఠశాలల తలుపులు మూతపడ్డాయి. దీంతో ఇన్నాళ్లూ పుస్తకాలతో కుస్తీపట్టిన పిల్లలను బంధువుల ఇళ్లకు పంపడం, దర్శనీయ స్థలాలకు, పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్లడం సహజం. అయితే సరదాగా సెలవులను గడిపేస్తే ఏం ప్రయోజనం ఉండదు. చక్కనైన ప్రణాళికతో తల్లిదండ్రులు ఆలోచిస్తే సెలవులు సద్వినియోగం అవుతాయి. వారి అభిరుచి మేరకు ప్రత్యేకంగా ప్రణాళిక రూపొందించాలి. శారీరక, మానసిక వికాసానికి దోహదపడే క్రీడలు, అందరిలో గుర్తింపు తెచ్చే పలు రకాల కళలు వారిలో అంతర్గతంగా ఉండే నైపుణ్యాలను వెలికి తీసే అంశాలపై కూడా వారిలో ఆసక్తిని పెంపొందింప చేయాలి. ప్రస్తుత పోటీ ప్రపంచంలో రోజంతా పుస్తకాలతోనే కుస్తీలు పట్టే చిన్నారులకు ఉదయం పాఠశాలకు వెళ్లి సాయంత్రం వరకు ఉండి, అక్కడ నుంచి ట్యూషన్‌కు వెళ్లి ఇలా రోజంతా చదువుతోనే సమయం గడిపోతోంది. ఇతర అంశాలపై దృష్టి పెట్టేందుకు ఆసక్తి ఉన్నా అవకాశం లేకుండా పోయింది. వేసవి సలవులే చిన్నారులకు ఒక ఆటవిడుపు. ఈ రెండునెలలు తాము ఆడింది ఆటగా, పాడింది పాటగా గడిపేస్తారు.

సంగీత, నృత్యాల కోసం..

జిల్లాలో సంగీతం, నృత్యం, వాద్యపరికరాలు నేర్చుకోవడంపై పలు సంస్థలు, వ్యక్తులు శిక్షణలు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. వారి వివరాలు శాస్త్రీయ సంగీతం విషయానికి వస్తే యువతకు నానాటికీ ఇష్టం పెరుగుతోంది. దీంతో తమ పిల్లలకు వేసవిలో సంగీత సాధన చేయిస్తున్నారు. కొత్తగా వేదిక లెక్కి, బుల్లితెరలో జరిగే పాటల పోటీలలో పాల్గొనేందుకు చిన్నారులు ఉత్సాహం చూపుతున్నారు. అందుకోసం తల్లిదండ్రులు కూడా ముందుకు వస్తూ సంగీతాన్ని తమ పిల్లలకు నేర్పిస్తున్నారు. 40 రోజుల పాటు తరగతులను నిర్వహిస్తున్నారు.

శ్రీకాకుళం పట్టణంలో..

శ్రీకాకుళం పట్టణంలో నృత్యం నేర్చుకోవాలనుకు వాళ్లు సంప్రదాయం కూచిపూడి గురుకులం, కళ్లేపల్లిలో కూచిపూడి నృత్యం, కర్ణాటక సంగీతంపై వేసవి శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. అక్కడికి వెళ్లేందుకు బస్సు సౌకర్యం కూడా ఏర్పాటు చేశారు. అక్కడే ఉండి నేర్చుకునేందుకు హాస్టల్ సౌకర్యం కూడా ఉంది. వివరాల కోసం 94406 81083 నంబర్‌ను సంప్రదించవచ్చు.

- పీఎన్ కాలనీలోని న్యూసెంట్రల్‌స్కూల్‌లో రఘుపాత్రుని శ్రీకాంత్, శివశ్రీ నృత్య కళానికేతన్ ఆధ్వర్యంలో పిల్లలకు శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ జూన్ పదో తేదీ వరకు కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యం కూడా నేర్పుతున్నారు. ఆసక్తి ఉన్నవారు 94405 50330 నంబర్‌ను సంప్రదించాలి.
- శాంతినగర్ కాలనీ మూడో లైన్‌లో ఎన్.పి.కవిత, శ్రీసత్యసాయి నృత్య కళానికేతన్ ఆధ్వర్యంలో జూన్ పదో తేదీ వరకు శాస్త్రీయ నృత్యం, జానపద నృత్యాలు సాయంత్రం నేర్పుతారు. ఆసక్తి ఉన్నవారు 99515 43434 నంబర్‌ను సంప్రదించాలి
- అభినయ నృత్య నికేతన్ ఆధ్వర్యంలో తిమ్మరాజు నీరజ జూన్ పదో తేదీ వరకు సాయంత్రం ఐదు గంటల నుంచి భరతనాట్యం, కూచిపూడి, కోలాటం, జానపద నృత్యం, సంగీతం కూడా నేర్పుతారు. వివరాల కోసం 97055 37328 నంబర్‌ను సంప్రదించాలి.
- శృతిలయ సంగీత శిక్షణాలయంలో రెడ్డి సత్యన్నారాయణ పర్యవేక్షణలో ఈ నెల 31వ తేదీ వరకు శాస్త్రీయ సంగీతంలో ప్రాథమిక అంశాలు, భక్తి, దేశభక్తి, లలిత గీతాలు, భజన, కీబోర్డు, ట్రాక్ సింగింగ్, తబలా, డోలక్, ఎలక్ట్రానిక్స్ రిథమ్స్‌లో శిక్షణ ఇస్తారు. ఆసక్తి ఉన్నవారు 95027 57479 నంబర్‌ను సంప్రదించాలి.
- పట్టణంలోని ఆకీరా డ్యాన్సు ప్లానెట్స్‌లో చిన్నారుల కోసం వేసవి శిబిరం నిర్వహిస్తున్నారు. ఇక్కడి స్పోకెన్ ఇంగ్లిష్, యోగా, అబాకస్, చెస్, డ్రాయింగ్, వెస్ట్రన్ డ్యాన్సు, భగవద్గీత, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ నేర్పుతారు. మూడు నుంచి 15 ఏళ్ల వయసు పిల్లలకు శిక్షణ ఇస్తారు. వివరాల కోసం 81434 94691 నంబరుకు సంప్రదించాలి.
- కత్తెరవీధిలోని శ్రీరాజరాజేశ్వరీ సంగీతం పీఠంలో సంగీత విభాగంలో సుసరాపు లక్ష్మీగణపతి శర్మ పర్యవేక్షణలో గాత్రం, వయోలిన్, కీబోర్డు, మృదంగంపై శిక్షణ ఇస్తారు. వివరాల కోసం 94405 13579 నంబర్లను సంప్రదించవచ్చు.
- పాండురంగవీధిలో ఉన్న వీఆర్ ఇనిస్టిట్యూట్‌లో కీబోర్డు, గిటార్, వోకల్ శిక్షణ ప్రారంభమైంది. మాస్టర్ సీహెచ్ వేంకటరావు ఆధ్వర్యంలో రెండు నెలలపాటు శిక్షణ ఇస్తున్నారు. గిటార్, కీబోర్డులపై మక్కువ ఉన్నవారు 93906 11285 నంబర్‌ను సంప్రదించాలి.


నృత్యంలో శిక్షణ పొందుతూ..

శిబిరాలు ఏర్పాటు

వేసవి సెలవుల కోసం ఎన్నో సంస్థలు ఆఫర్లతో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తుంటారు. పట్టణ ప్రాంతంలో ఇవి ఎక్కువగా ఉంటాయి. ఈ శిబిరాలలో కరాటే, యోగా, ఈత, చిత్రలేఖనం, సంగీతం, కంప్యూటర్, నృత్యం, వీణ, గిటార్ వంటి వాద్య పరికరాలు నేర్పడం వంటి అంశాలతో శిబిరాలు నిర్వహిస్తున్నారు.


లాఫింగ్ క్లబ్‌లో డ్రాయింగ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు


పాతశ్రీకాకుళంలొ సంగీత సాధన చేస్తున్న చిన్నారులు

డ్రాయింగ్, క్రాఫ్టులో ఉచిత శిక్షణ

పట్టణంలోని పాతశ్రీకాకుళం కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో డ్రాయింగ్‌పై ఉచిత వేసవి శిక్షణ నిర్వహిస్తున్నట్లు రిటైర్డ్ డ్రాయింగ్ టీచర్ ఎల్.నందికేశ్వరరావు తెలిపారు. రోజూ ఉదయం ఎనిమిది గంటల నుంచి క్లాసులు జరుగుతాయి. ఐదేళ్ల పైబడి ఉన్నవారు డ్రాయింగ్, క్రాఫ్ట్, భరతనాట్యంలో శిక్షణ పొందవచ్చు. 94410 72761 నంబర్‌ను సంప్రదించాలి.

వెల్లువెత్తిన మహిళా చైతన్యం

- అత్యధికంగా ఓటు హక్కు వినియోగించుకున్న వైనం


టెక్కలి: సీతాపురం పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళా ఓటర్లు (ఫైల్)

టెక్కలి: గడచిన ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన ప్రతీ సంక్షేమ పథకంలో మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. దీంతో ఆ రుణం తీర్చుకునే విధంగా తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టెక్కలి నియోజకవర్గంలో మహిళా ఓటర్లు అత్యధికంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 2,36,327 మంది ఓటర్లు ఉండగా.. ఈ ఎన్నికల్లో 1,86,897 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారిలో అత్యధికంగా 95,569 మంది మహిళా ఓటర్లు ఓటును సద్వినియోగం చేసుకున్నారు. పురుషులు 91,326 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అత్యధికంగా ఓటు హక్కు వినియోగించుకున్న మహిళా ఓటర్లు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నట్లు సర్వేలు చెబుతున్నాయి. వాస్తవానికి పోలింగ్ ప్రక్రియలో భాగంగా కొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయించినప్పటికీ, ఓటు వేయడానికి వచ్చిన మహిళలు ఎక్కడా విసుగు చెందకుండా గంటల తరబడి క్యూలో నిలబడి మరీ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన మహిళా సంక్షేమ పథకాలు ప్రభావం ఈ ఎన్నికల్లో అత్యధికంగా మహిళలు ఓటు హక్కు వినియోగించుకునేలా చేశాయి. ఈ ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్ రుణం తీర్చుకోవడానికి పెద్ద ఎత్తున మహిళా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నట్టు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

పలాసలో మహిళా ఓటర్లే కీలకం!

పలాస: పలాస నియోజకవర్గంలో మహిళా ఓటర్లే అత్యంత కీలకంగా ఉన్నారు. సోమవారం జరిగిన ఎన్నికల సరళిని చూస్తే ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపు ఓటమిలను నిర్ణయించే దిశగా మహిళా ఓటర్లే కనిపిస్తున్నారు. ముఖ్యంగా నియోజకవర్గంలో మొత్తం మహిళా ఓటర్లు ఒకలక్షా 12 వేల 49 మంది ఉండగా ఇందులో 88,416 మంది మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషులు ఒకలక్షా ఏడువేల 278 మంది ఉండగా 76 వేల 839 మంది ఓటు వేశారు. మొత్తం నియోజకవర్గంలో గతంలో ఎన్నడు లేని విధంగా 75.34 శాతం పోలింగ్ నమోదయిందని ఎన్నికల అధికారులు చెప్పారు. దీంతో అత్యధికంగా మహిళా ఓటర్లు పాల్గొని అభ్యర్థుల జయాపజయాలను నిర్దేశించనున్నారని పరిశీలకులు చెబుతున్నారు. అత్యధికంగా పోలింగ్ నమోదు కావడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ప్రజలు ఈసారి పట్టం కడుతున్నారనే అభిప్రాయం సర్వత్రా వినిస్తుంది.


తర్లాకోటలో పోటెత్తిన మహిళా ఓటర్లు

ప్రారంభమైన సింధు పోలమ్మ మహోత్సవాలు


సింధుపోలమ్మ అమ్మవారి విగ్రహం


ఆకట్టుకుంటున్న విద్యుద్దీపాలంకరణ

కంచిలి: మండలంలోని కేసరపడ గ్రామదేవత సింధు పోలమ్మ గ్రామదేవత నవరాత్రి మహోత్సవాలు ఈ నెల 13వ తేదీ రాత్రి నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారిని మేళతాళాలు, వేషధారణలతో ఊరేగిస్తూ తీసుకొచ్చారు. ఉత్సవాలు ఈ నెల 21వ తేదీ వరకు నిర్వహించనున్నారు. తొమ్మిది రోజులపాటు అమ్మవారిని గ్రామ పుర వీధుల్లో మేళతాళాలతో ఊరేగింపు చేపడతారు. ఉత్సవాల సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. గ్రామం అంతటా కళ్లు మిరుమిట్లుగొలిపే విధంగా విద్యుద్దీపాలంకరణ చేపట్టారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన సదస్సు


అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి శ్రీనివాసరావు


కోటబొమ్మాళి: న్యాయవాదులతో మాట్లాడుతున్న జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత

సోంపేట: సోంపేట కోర్టుల సముదాయంలో బార్ అసోసియేషన్ న్యాయవాదులతో సోంపేట సీనియర్ సివిల్ న్యాయమూర్తి జి.శ్రీనివాసరావు మధ్యవర్తిత్వంపై అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. కోర్టులో పెండింగ్ ఉన్న కేసులను పూర్తి చేయడానికి మధ్యవర్తిత్వం ఎందుకు అవసరం, మధ్యవర్తిత్వం నిజంగా సహాయపడుతుందా, మధ్యవర్తిత్వం వలన కలుగులాభాల గురించి న్యాయవాదులకు అవగాహన కల్పించారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.సర్వేశ్వరరావు, సెక్రటరీ డి.జగన్నాయకులు, న్యాయవాదులు బి.లక్ష్మీనారాయణ, పున్నయ్య, ఎస్.విజయ్‌కుమార్, డి.జోగారావు, రుక్మాంగదుడు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసుల రాజీకి కృషి

కోటబొమ్మాళి: న్యాయవాదులతో మధ్యవర్తిత్వం చేయించడంద్వారా కేసుల రాజీకి కృషి చేస్తున్నట్లు జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత అన్నారు. కోటబొమ్మాళి కోర్టులో బార్ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2015 నుంచి సుప్రీంకోర్టు, హైకోర్టు వారు ఈవిధానాన్ని అమలు చేస్తున్నారన్నారు. శ్రీకాకుళం జిల్లాకోర్టు ఆవరణలో ఇప్పటికే మధ్యవర్తిత్వ కేంద్రాన్ని నెలకొల్పారని చెప్పారు. అక్కడ శిక్షణపొందిన కొంతమంది న్యాయవాదులు, స్వచ్ఛంద కార్యకర్తల ద్వారా ఇప్పటికే కేసులరాజీకి కృషి జరుగుతోందన్నారు. కోర్టుల్లో పనిచేస్తున్న న్యాయవాదులు చొరవతీసుకొని ఇరువర్గాల మధ్య సామరస్య వాతావరణం కల్పించడం ద్వారా కేసుల రాజీకి కృషిచేయాలని కోరారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లఖినేని శ్రీనివాసులు, న్యాయవాదులు వై.వెంకటరావు, బి.నారాయణరావు, కె.మన్మథరావు, పి.వాసుదేవరావు, వి.నేతాజీరావు, వి.అప్పలనాయుడు, కె.మన్మథరావు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన ఉండాలి

టెక్కలి: కొన్ని సందర్భాల్లో మధ్య వర్తిత్వంపై న్యాయవాదులకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి ఎస్.హెచ్.ఆర్.తేజ చక్రవర్తి మల్ల సూచించారు. మధ్యవర్తిత్వం దాని ఆవశ్యకతపై మంగళవారం స్థానిక కోర్టులో న్యాయవాదులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మధ్యవర్తిత్వం వలన కలిగే ప్రయోజనాలు, ఆవశ్యకత, ఆర్బిట్రేషన్ తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్షుడు వి.వివేకానందా, కార్యదర్శి ఎస్.దివాకర్‌తో పాటు న్యాయవాదులు పాల్గొన్నారు.

టెక్కలిలో స్వల్పంగా పెరిగిన పోలింగ్ శాతం


టెక్కలి పోలింగ్ కేంద్రం వద్ద ఓటువేసేందుకు క్యూ కట్టిన ఓటర్లు

- 2019 సార్వత్రిక ఎన్నికల్లో 78.79 శాతం
- తాజా ఎన్నికల్లో 79.1 శాతం నమోదు

టెక్కలి: టెక్కలి నియోజకవర్గంలో తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 2019 ఎన్నికల కంటే స్వల్పంగా పోలింగ్ శాతం పెరిగింది. గత సార్వత్రిక ఎన్నికల్లో 78.79 శాతంనమోదు కాగా, ఈ ఎన్నికల్లో 79.1 శాతం పోలింగ్ నమోదైంది. 2019, ప్రస్తుత ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పరిశీలిస్తే..

- 2019 ఎన్నికల్లో మొత్తం 2,22,222 ఓట్లకు గాను 1,75,092 ఓట్లు పోలయ్యాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 1,12,093 మంది పురుషులకు 85,532 మంది, 1,10,110 మహిళ ఓటర్లకు 89,559 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 316 పోలింగ్ కేంద్రాల పరిధిలో 78.79 శాతం పోలింగ్ నమోదైంది. కాగా ఈ నెల 13వ తేదీన జరిగిన ఎన్నికల్లో 2,36,327 ఓట్లకు 1,86,897 ఓట్లు పోలయ్యాయి. మొత్తం 1,17,816 మంది పురుషులకు 91,326 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే 1,18,502 మంది మహిళా ఓటర్లకు ఈ ఎన్నికల్లో 95,569 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 315 పోలింగ్ కేంద్రాల పరిధిలో 79.1 శాతం పోలింగ్ నమోదైంది. అయితే గత ఎన్నికల్లో పోలైన ఓట్లు, ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో పోలైన ఓట్లతో గెలుపు ఓటములపై నాయకులు అంచనాలు వేసుకుంటున్నారు.

అధికంగా ఓటేసిన మహిళలు

కంచిలి: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో సోమవారం జరిగిన ఎన్నికల్లో మహిళలే ఎక్కువ మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 299 కేంద్రాల్లో పోలింగ్ జరిగింది. 2,68,202 ఓటర్లు ఉండగా.. 1,87,136 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 1,02,778 మంది మహిళలు, 84,356 మంది పురుషులు, ఇతరులు ఇద్దరు ఓట్లువేశారు. ఓవరాల్‌గా 69.77 శాతం ఓటింగ్ నమోదవ్వగా.. మహిళలే 74.78 శాతం ఓట్లు వేశారు.


జలంత్రకోట కేంద్రం వద్ద క్యూలైన్లో ఉన్న ఓటర్లు

మహిళా లోకానికి కృతజ్ఞతలు

టెక్కలి: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా అత్యధికంగా మహిళలు ఓటు హక్కు వినియోగించుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చింతాడ మంజు అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో మహిళలంతా వైఎస్సార్‌సీపీకే మద్దతు పలికారని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రశాంత ఓటింగ్‌కు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రభుత్వ పాఠశాలల ఫలితాలపై ప్రచారం


బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ పాఠశాల సిబ్బంది ముద్రించిన కరపత్రం

కాశీబుగ్గ: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివిన విద్యార్థులు పరీక్ష ఫలితాల్లో సత్తాచాటారు. దీంతో ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తేందుకు ఉపాధ్యాయ సిబ్బంది కృషి చేస్తున్నారు. పలాస మండలం బ్రాహ్మణతర్లా గ్రామంలో ఉన్నటువంటి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కరపత్రాలు ఆకట్టుకుంటున్నాయి. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అధిక మార్కులు సాధించిన విద్యార్థుల ఫొటోలతోపాటు.. వివరాలతో కూడిన కరపత్రాలు ముద్రించి పరిసర ప్రాంతాలలో పంచిపెడుతున్నారు. ఫలితాలను చూసి తమ పాఠశాలలో ప్రవేశం పొందండి అంటూ ప్రచారం చేస్తున్నారు.